ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
ఆదివారం 11 జనవరి 2026 www.prajaswaramdaily.com 4 PM

# మీకు నచ్చిన వాటికే టికెట్ల ధరల పెంపునకు అనుమతా?

**మాజీ మంత్రి హరీష్ రావు**

హైదరాబాద్, ప్రజాస్వరం
శాఖ ఒకరిది.. పెత్తనం మరొకరిదని మాజీ మంత్రి హరీష్ రావు ఎద్దేవా చేశారు. నచ్చిన వారి సినిమాల టికెట్ల ధరల పెంపునకు అనుమతి ఇస్తారా? అని ప్రశ్నించారు. సినిమా టికెట్ల ధరల పెంపుపై హైకోర్టు మొట్టికాయలు వేసినా సర్కారు తీరు మారలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. థియేటర్లలో కంటే సచివాలయంలోనే సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా నడుస్తోందని వ్యాఖ్యానించారు. సినిమాటోగ్రఫీ మంత్రికి తెలియకుండానే ధరల పెంపు జీవో ఇచ్చారని హరీశ్‌రావు విమర్శించారు.



# వేల వాహనాల ప్రయాణం

**1.29 లక్షల మంది స్వస్థలాలకు చేరుతున్నట్లు అంచనా**

**హైదరాబాద్, ప్రజాస్వరం**

హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ వైపునకు వెళ్లే రహదారులన్నీ సంక్రాంతికే అన్నట్లుగా మారాయి. నగరం నుంచి పల్లెలకు పయనమవుతున్న వాహనాలతో రోడ్లన్నీ కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి 65, సూర్యాపేట – ఖమ్మం 365 బీబీ, నార్కట్‌పల్లి వయా నల్గొండ, మిర్యాలగూడ మీదుగా అద్దంకి, గుంటూరు వైపునకు ప్రయాణించే వారితో రద్దీగా దర్శనమిస్తున్నాయి.

**జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్న వారంతా స్వగ్రామాల్లో సంబురంగా సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు కుటుంబ సమేతంగా బయలుదేరారు. ప్రయాణిస్తున్న వాహనాలతో టోల్ గేట్లు, హోటళ్లు, పెట్రోల్ బంకులు కళకళలాడుతున్నాయి. అక్కడక్కడ రోడ్డు పనులు చేస్తున్న ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు.**



పంతంగి టోల్ ప్లాజా ...హైదరాబాద్ – విజయవాడ వైపు శుక్రవారం రాత్రి 12 గంటల నుంచి శనివారం సాయంత్రం 4 గంటల వరకు సుమారు 43 వేల వాహనాలు ప్రయాణించాయి. నిమిషానికి 45 వాహనాల చొప్పున టోల్‌గేట్‌ను దాటినట్లు గణాంకాలు పేర్కొన్నాయి. ఈ మార్గంలో అత్యధికంగా కార్లు వరుస కట్టాయి. ఒక్కో కారులో సుమారు ముగ్గురు చొప్పున లెక్కేసినా దాదాపు 1.29 లక్షల మంది తమ స్వస్థలాలకు చేరుతున్నట్లు అంచనా వేస్తున్నారు.

**పండుగ సంతోషంతో స్వస్థలాలకు వెళ్తున్న వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గమ్యస్థానాలకు చేరుకోవాలని అధికారులు అంటున్నారు. దీనికోసం జాతీయ రహదారి-65కు ఆనుకుని ఉన్న, దీనికి సమీపంలోని గ్రామాల్లోని వ్యక్తులు అనవసరంగా, కారణం లేకుండా రోడ్డుపైకి వచ్చి ఆపదలో చిక్కుకోవద్దని సూచిస్తున్నారు. దీనికి బదులుగా ప్రత్యామ్నాయ దారుల్లో ప్రయాణించి పనులు పూర్తి చేసుకోవాలని కోరుతున్నారు. దీంతో పండగకు ప్రయాణిస్తున్న వారికి దారిచ్చిన వారవుతారని అంటున్నారు.**

# సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం ఉద్యమం తీవ్రతరం: తలసాని


**హైదరాబాద్, ప్రజాస్వరం**



: సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బీఆర్ ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. డీలిమిటేషన్ పేరుతో సికింద్రాబాద్ ను ముక్కలు చేస్తే సహించేది లేదని.. కార్పొరేషన్ తో పాటు జిల్లాను కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ‘‘ఈ నెల 17న నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపాలని నిర్ణయించాం. సికింద్రాబాద్ లో రైల్ రోకో, బంద్ లు నిర్వహిస్తాం. నిరవధిక దీక్షలు, అవసరమైతే ఆమరణ దీక్ష చేస్తాం. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని దెబ్బకొట్టే కుట్ర జరుగుతోంది. జీహెచ్ ఎంసీ డివిజన్ల పునర్విభజన తప్పుల తడకగా ఉంది. మేయర్ కి కూడా తెలియకుండా డివిజన్లు విభజించారు’’ అని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.

# ఎక్స్.. 600కి పైగా ఖాతాల తొలగింపు

**న్యూఢిల్లీ, ప్రజాస్వరం**



సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఎక్స్ తన తప్పును అంగీకరించిందని, భారత చట్టాలకు అనుగుణంగా పనిచేస్తామని భారత ప్రభుత్వానికి హామీ ఇచ్చిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వీటిలో ఎక్కువగా దాని గ్రోక్ ఏఐ సృష్టించిందని, ఎక్స్ దాదాపు 3,500 కంటెంట్ భాగాలను బ్లాక్ చేసి భారతీయ చట్టాలను ఉల్లంఘించినట్లు తేలిన 600కి పైగా ఖాతాలను తొలగించిందని అధికారులు అన్నారు. ఇకపై తన ప్లాట్ ఫామ్ లో అశ్లీల చిత్రాలను తొలగిస్తామని ఆ ప్లాట్ ఫామ్ తెలియజేసిందన్నారు. ఎక్స్ కార్ప్, దాని గ్రోక్ ఏఐ చాట్ బాట్ ద్వారా ఏకాభిప్రాయం లేని లైంగిక కంటెంట్ ఉత్పత్తిపై కంపెనీకి ఇచ్చిన నోటీసుపై ప్రభుత్వానికి రాతపూర్వక ప్రతిస్పందనను సమర్పించిందన్నారు. తన ప్లాట్ ఫామ్ లో అశ్లీల, నగ్న, అసభ్యకరమైన కంటెంట్ ఉత్పత్తి, ప్రసరణను నిరోధించడంలో విఫలమైనందుకు ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఎక్స్ కార్ప్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఎక్స్ కార్ప్ ను 72 గంటల్లోపు ఆదేశించిందన్నారు. ఇకపై చట్టాన్ని ఉల్లంఘించే ప్లాట్ ఫారమ్ లోని వినియోగదారులపై, తదుపరి నోటీసు లేకుండా, ఐటీ చట్టం, దాని నియమాలు,బీఎన్ఎస్ఎస్, బీఎన్ఎస్, ఇతర చట్టాల ప్రకారం కఠినమైన పరిణామాలు ఎదుర్కోవలసి రావచ్చని ప్రభుత్వ హెచ్చరించిందని తెలిపారు.

# సోమనాథ్ శౌర్యయాత్రలో ప్రధాని

**మోదీ కాన్వాయ్ వెంట 108 అశ్వాలు**

**యోధులకు నివాళుల ర్పించిన మోదీ**



**గాంధీనగర్, ప్రజాస్వరం**
మూడు రోజుల పర్యటన నిమిత్తం గుజరాత్ వచ్చిన ఆయన ఉదయం శౌర్యయాత్రలో పాల్గొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం సోమనాథ్‌లోని మహాదేవుడి ఆలయాన్ని సందర్శించుకొని, పూజలు చేశారు . విదేశీ దురాక్రమణదారుల నుంచి సోమనాథ్ ఆలయాన్ని రక్షించేక్రమంలో తమ ప్రాణాలు అర్పించిన యోధులకు గుర్తుగా ఈ శౌర్యయాత్ర నిర్వహించారు. దానిలో భాగంగా మోదీ ఆ యోధులకు నివాళులు అర్పించారు. ఈ యాత్రకు భారీ సంఖ్యలో హాజరైన ప్రజలు.. మోదీ, మోదీ అని నినాదాలు చేస్తూ ప్రధాని కి స్వాగతం పలికారు. ఇక ఇక్కడ 108 అశ్వాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. వాటిని ఈ యాత్రకోసం ప్రత్యేకంగా తీసుకువచ్చారు. ఆలయం వైపు వెళ్తున్న ప్రధానికి అవి ఎస్కార్ట్‌గా మారినట్లు ఆ సన్నివేశం తలపించింది. అనంతరం మోదీ సోమ్‌నాథ్ ఆలయానికి చేరుకొని, పూజలు నిర్వహించారు

# 3500 ఇందిరమ్మ ఇళ్లకు 22, 500 కోట్లు ఖర్చు

**ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**సీఎం భట్టి గోదావరిఖనిలో పర్యటన**

పెద్దపల్లి, ప్రజాస్వరం



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నియోజకవరానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను కేటాయించిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ ఇళ్ల కోసం రూ.22,500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ తో కలిసి డిప్యూటీ సీఎం భట్టి గోదావరిఖనిలో పర్యటించారు. ప్రతివారం బిల్లులు మంజూరు చేస్తామన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. స్థలం ఉన్న వారు ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు అందజేస్తోందని గుర్తుచేశారు. రామగుండం కార్పొరేషన్ లో రూ.175 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# మేడారం.. భక్త జనసంద్రం

ములుగు జిల్లా మేడారంలో రద్దీ పెరిగింది. సంక్రాంతి సెలవులు కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణంలో సందడి నెలకొంది. రద్దీ నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. మేడారం

# ప్రకృతితో కలిసి జీవించాలి

**మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు**

**హైదరాబాద్, ప్రజాస్వరం**

మన భవిష్యత్ బాగుండాలంటే ప్రకృతితో కలిసి జీవించాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మన పండుగలన్నీ దానితోనే ముడిపడి ఉన్నాయని చెప్పారు. ముచ్చింతల్‌లో స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రాజకీయాల్లో వారసత్వాన్ని ప్రోత్సహించడం నాకు ఇష్టం ఉండదు. అందుకే నా కుమారుడు, కుమార్తెను రాజకీయాల్లోకి తీసుకురాలేదు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటమే పిల్లలకు మనమిచ్చే సంపద. నా పిల్లలకు వారసత్వంగా స్వర్ణ భారత్ ట్రస్ట్ మాత్రమే ఇస్తున్నాను. ఈ సేవను కొనసాగించాలని నా కుమార్తెకు చెప్పాను. హైదరాబాద్ అద్భుతమైన నగరం. ఏపీకి కూడా ఇలాంటిది కావాలి. హైదరాబాద్‌లా అమరావతి కూడా అభివృద్ధి చెందాలి. ఏపీ రాజధానికి కేంద్రం సహకరిస్తుందనే నమ్మకం నాకుంది’’ అని వెంకయ్యనాయుడు అన్నారు. ‘‘పంటలన్నీ ఇంటికి చేరే సమయంలో సంక్రాంతి పండగ నిర్వహించుకుంటాం. ఈ మధ్య వాతావరణ మార్పులతో రుతువులు మారుతున్నట్లు ఉంది. ఎన్ని మారినా మన సంస్కృతి–సంప్రదాయాలను కాపాడుకోవాలి. మూలాలు మర్చిపోకూడదనే ఏటా స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

